


కూటమి ప్రభుత్వం హామీల అమలులో దృఢంగా ముందుకు సాగుతోంది. ఉగాది సందర్భంగా మంత్రి నారా లోకేష్ జాబ్ క్యాలెండర్ విడుదలతో నిరుద్యోగుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. యువతకు అండగా నిలుస్తూ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 20.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 332 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# "ఉద్యోగాల జాతర"

## యువతకు మంత్రి లోకేష్ ఉగాది కానుక

- ఉగాది కానుకగా 10,060 ఉద్యోగాలు...
- యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ యువత ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్రప్రభుత్వం ఉగాది పర్వదినాన విడుదల చేసి నిరుద్యోగులకు శుభవార్త అందించింది. విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌తో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని స్పష్టం చేస్తూ యువతకు దీర్ఘకాలిక నమ్మకం కల్పించారు.

జాబ్ క్యాలెండర్‌లో భాగంగా పోస్టుల వారీగా నోటిఫికేషన్ తేదీలను ముందుగానే వెల్లడించడం విశేషంగా నిలిచింది. ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టుల భర్తీకి మే 15న నోటిఫికేషన్ విడుదల కానుంది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలకు ఇది కీలకంగా మారనుంది.

ఆగస్టు 15న 91 గ్రూప్-1 పోస్టులు, హోంశాఖలో 2,778 పోస్టులు, ఇతర శాఖల్లో 928 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అనంతరం సెప్టెంబర్ 15న 750 గ్రూప్-2 పోస్టులు, 503 ఏఈఈ పోస్టులు, ఇతరత్రా 506 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 15న పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించిన 3,004 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

గత ఏడాది 16 వేల డీఎస్సీ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చినట్లుగా జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి, సమయానికి ఫలితాలు వెల్లడించి, అన్ని పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని యువతకు ఉగాది కానుకగా ఉద్యోగాల పండుగ వచ్చిందన్నారు. నిర్దేశిత సమయంలో పరీక్షలు నిర్వహించి పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించారు. సిలబస్ కూడా ముందుగానే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇకపై ప్రతి ఏటా ఉగాదికి ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన ఉంటుందని నిరుద్యోగ యువతకు ఈ సందర్భంగా మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. మిగతా 2లో...




| నోటిఫికేషన్ తేదీ | విభాగం | పోస్టుల సంఖ్య |
|---|---|---|
| మే 15, 2026 | ఉన్నత విద్య | 1500 |
| ఆగష్టు 15, 2026 | గ్రూప్ I | 91 |
| | హోమ్ శాఖ | 2778 |
| | ఇతర శాఖలు | 928 |
| సెప్టెంబర్ 15, 2026 | గ్రూప్ II | 750 |
| | ఇంజనీరింగ్ | 503 |
| | ఇతర శాఖలు | 506 |
| అక్టోబర్ 15, 2026 | పాఠశాల/ఇంటర్ విద్య | 3004 |
| మొత్తం ఉద్యోగాలు | | 10,060 |

### ఉగాది రోజున పేదల సంక్షేమంపై

# తొలి సంతకం

- రూ.55.63 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదల దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం
- 6,787 మంది పేదలకు కలగనున్న లబ్ధి
- 21 నెలల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు రూ.1,241 కోట్ల సాయం
- సీఎంకు టీటీడీ, దుర్గగుడి అర్చకుల ఆశీర్వచనం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు నూతన సంవత్సరం తొలి రోజన పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. గురువారం ఉగాది పర్వదినాన ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై తొలి సంతకం చేశారు. మిగతా 2లో...

### మంత్రి లోకేష్ చిత్తశుద్ధికి

# నిదర్శనం



- ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదలతో యువతకు తీపి కబురు
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర యువతకు ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉగాది పర్వదినాన మంత్రి నారా లోకేష్ యువతకు తీపి కబురు అందించారని పేర్కొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన అన్నారు. గత 22 నెలల్లో సుమారు ఆరున్నర లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తాజా జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ శాఖలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం విశేషమన్నారు.

ప్రాథమిక, ఉన్నత విద్యా రంగాల్లో ప్రమాణాలను పెంచేందుకు మంత్రి లోకేష్ చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేక యువతను మిగతా 2లో...

### 630 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ఎంపిక

# జాబితా సిద్ధం

- వచ్చేవారం ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగులు
- త్వరలోనే బోధన ఆసుపత్రుల్లోని 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ఎంపిక జాబితా కూడా రెడీ
- 'జీరో వెకెన్సీ' పాలసీ కింద ఆసుపత్రుల్లోని ఖాళీ పోస్టుల భర్తీని నిరంతరం కొనసాగిస్తున్నాం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా 630 మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ కోసం ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసింది. శాశ్వత విధానంలో ఎంబీబీఎస్ అ-ర్హతతో ఈ పోస్టుల భర్తీ నిమిత్తం మిగతా 2లో...

### పశ్చిమాసియా దేశాల నేతలతో

# మోదీ కీలక చర్చలు



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న వేళ.. పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. తాజాగా ఒమన్ సుల్తాన్, మలేషియా ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడితో సంభాషించారు.

### ఎల్పీజీ కొరత లేకుండా కేంద్ర


# ప్రభుత్వం చర్యలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్ని అవాంతరాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఎల్పీజీ కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు పేర్కొంది.

## అకాల వర్షాలతో 1,215 హెక్టార్లలో పంట నష్టం

- ఆరు జిల్లాల్లోని 16 మండలాలపై అధిక ప్రభావం
- దెబ్బతిన్న మరో 267 హెక్టార్లలోని ఉద్యాన పంటలు
- వ్యవసాయ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రాథమిక అంచనాలు వెల్లడించిన అధికారులు
- పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని లెక్కించాలని సీఎం సూచన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో వ్యవసాయ పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గాలివానలు, వర్షాలు, వడగళ్లత కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, మిగతా 2లో...

### కవులు, కళాకారులు, రచయితలకు

# సమున్నత గౌరవం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం తెలుగు కళా వైభవాన్ని పునరుద్ధరిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించగా, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సహచర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మిగతా 2లో...

### జాబ్ క్యాలెండరులో విద్యా, పోలీస్ శాఖల్లో

# ఖాళీల భర్తీకి ప్రాధాన్యం

- దశల వారీగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది
- యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ఆచరణ సాధ్యం చేస్తున్న మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు...హోం మంత్రి అనిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నిరుద్యోగ యువత కలలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన మిగతా 2లో...

## ప్రజలకు మేలు జరిగే పనులకే అధిక ప్రాధాన్యత



**పాలకొల్లు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు మేలు జరిగే పనులకే అధిక ప్రాధాన్యతనిస్తూ పని చేస్తున్నానని, తన వ్యక్తిగత లబ్ధి కోసం ఏనాడూ పని చేయలేదని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు ఎంఎంకెఎన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, బివిఆర్ఎం బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల తీర్చుకునేలా రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తున్నానని, మిగతా 2లో...

## అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు పూర్తి సహాయం అందిస్తాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రాబోయే 3-4 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గంటకు 30-40 కి.మీ వేగంతో) వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం/ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, మిగతా 2లో...

## కూటమి 20 నెలల పాలనలో 6,28,347 ఉద్యోగాల కల్పన

- జగన్ అరాచక పాలనలో 34 లక్షల మంది భవిష్యత్తు నాశనం
- వైసీపీ ఐదేళ్ల పాలనలో 4100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలు
- చంద్రబాబుతోనే యువత, విద్యార్థులకు భవిష్యత్తు



# హోర్ముజ్ వద్ద 2,200 బంకర్ బస్టర్ల దాడి

**ఇరాన్ భూగర్భ క్షిపణి స్థావరాలపై అమెరికా దాడి**

- జలసంధి వద్ద ఇంధన రవాణాకు ముప్పుగా యాంటీ-షిప్ క్రూజ్ క్షిపణులు
- అందుకే 5వేల పౌండ్ల బాంబుల వర్షం
- ఎక్స్‌లో పేర్కొన్న యూఎస్ సెంట్రల్ కమాండ్



**టెహ్రాన్, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

యూఎస్ ఇరాన్ మధ్య యుద్ధం భీకరంగా జరు గుతోంది. దీంతో పశ్చిమాసియాలో తీవ్రఉద్రిక్తతలు రోజూ విజృంభిస్తూనే ఉన్నాయి. ఇంధన రవాణాకు జీవనాడి అయిన హో ర్ముజ్ జలసంధిని తన గుప్పిట్లో పెట్టుకున్న ఇరాన్‌ను అడ్డుకునేందుకు అమెరికా బుధవారం భీకర దాడులు చేసింది. ఈ జలసంధి సమీపంలోని భూగర్భ క్షిపణి స్థావరంపై 2,200 కిలోల బంకర్ బస్టర్ల బాంబుల వ ర్షం కురిపించింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాల్లో ఉన్న యాంటీ-షిప్ క్రూజ్ క్షిపణులు.. అంతర్జాతీయ సముద్ర రవాణాకు ముప్పు గా మారాయని, అందుకే ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. దీంతో భారీ లోతులో ఉన్న లక్ష్యాలను ఢీకొనేలా 5వేల పౌండ్ల (దాదాపు 2200 కిలోలకు పైమాటే) శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులతో విజయవంతంగా దాడులు చేశామని వెల్లడించింది. ఇరాన్ తీర రక్షణ నెట్‌వర్క్‌లో భాగమైన ఆయుధ నిల్వలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా చెప్పింది. హోర్ముజ్‌లో ఇంధన రవాణా నిరంతరాయంగా జరగాలంటే ఈ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉందని అగ్రరాజ్యం భావిస్తోంది. తద్వారా ఈ జలసంధి మార్గంలో వెళ్లే నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా అడ్డు కుంటామని తాజా చర్యతో అమెరికా చెప్పినట్లుంది. హోర్ముజ్ జల సంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించాయని అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సహాయం చేసినప్పటికీ తమకు మద్దతు రావడం లేదని ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తర్వాత కొద్ది గంటల్లోనే ఈ దాడి జరగడం గమనార్హం. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణలను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధ నిర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే సాధారణంగా బంకర్ బస్టర్ బాంబులను భూగర్భంలో ఉండే లక్ష్యాలను ధ్వంసం చేసేందుకు వినియోగిస్తారు. 2022 నాటి నివేదికల ప్రకారం.. ఈ బాంబును తయారుచేసేందుకు ఒక్కోదానికి 2.88లక్షల డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.2.6కోట్లు) ఖర్చవుతుందని అంచనా వేశారు. గతేడాది ఇరాన్ అణు కేంద్రాల ను టార్గెట్ చేసుకున్నప్పుడు అమెరికా ఈ బంకర్ బస్టర్లను ప్రయోగించింది. అయితే, నాటి దాడుల్లో 30వేల పౌండ్ల (13,600 కిలోల) బంకర్ బస్టర్ బాంబులను అమెరికా ఉపయోగించింది.

# దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు

- సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లు
- చిత్తూరు జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ ఏ రాజేంద్రన్
- 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం



**చిత్తూరు, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యలను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్నవారని చిత్తూరు జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ ఏ రాజేంద్రన్అన్నారు. బుధవారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో 'దివ్యాంగ శక్తి' (దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం) పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మొత్తం 33,848 మంది దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లాభం చేకూరనుంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు ఈ పథకానికి అర్హులని చెప్పారు. ఇప్పటి వరకు 50 శాతం రాయితీతో ప్రయాణిస్తున్న దివ్యాంగులకు ఇకపై పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పిస్తామని పేర్కొన్నారు. అయితే నాన్‌స్టాప్, ఇంటర్‌స్టేట్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం ఉన్న విధంగానే 50 శాతం రాయితీ కొనసాగుతుందని తెలిపారు.ఎం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం తరహాలోనే, ఇప్పుడు దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషకరమని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ దివ్యాంగులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుట్టపల్లిలో రైతులకు చాప్ కట్టర్ల పంపిణీ

**కుప్పం, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**



కుప్పం నియోజకవర్గం, కుప్పం మండలం గుట్టపల్లి గ్రామంలోని వెటర్నరీ సెంటర్ వద్ద రైతులకు చాప్ కట్టర్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి.ఎస్. మునిరత్నం హాజరై రైతులకు యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఖర్చుల తగ్గింపు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన యంత్రాలు, పరికరాలను రైతులకు అందించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చాప్ కట్టర్ల వినియోగంతో మేత ఖర్చులు తగ్గడంతో పాటు పశువుల ఆరోగ్యం మెరుగుపడి, పాల ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలు, పంటల బీమా, నాణ్యమైన విత్తనాలు, మార్కెట్ సదుపాయాలు వంటి సేవలను అందిస్తూ ప్రతి రైతు ఆర్థికంగా బలపడేలా చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్.. నీ మనస్సాక్షిని అడుగు

**విశాఖపట్నం, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

"జగన్.. నీ మనస్సాక్షిని అడుగు. సునీత బాధితు రాలా..? కాదా..?" అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల.. వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్‌ను ఉద్దేశించి నిలదీశారు. కడప పార్లమెంటు సీటు కేంద్రంగానే మాజీ మంత్రి, తమ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిందని చెప్పారు. "వివేకా హత్యపై ప్రజలను గందరగోళానికి గురిచేయడమే జగన్ సిద్ధాంతంగా కనిపిస్తోంది. వివేకా హత్య ముమ్మాటికీ కడప ఎంపీ సీటు కేంద్రంగానే జరిగింది. చిన్నాన్న ఈ విషయమై నా వద్దకు వచ్చి రెండు గంటలపాటు చర్చించారు. అవినాశ్ రెడ్డికి కడప ఎంపీ సీటు కరెక్ట్ కాదని ఆయన గట్టిగా నమ్మారు. ఇదే విషయాన్ని జగన్‌తోపాటు అందరికీ చెప్పారు. అయినా.. జగన్ అవినాశ్‌రెడ్డికే టికెట్ ఇచ్చారు." అని షర్మిల తెలిపారు. జగన్ మాటను గౌరవించి 2019 ఎన్నికల్లో అవినాశ్ గెలుపు కోసం వివేకా కృషి చేశారని చెప్పారు. అయితే, వివేకానందరెడ్డి తమకు ఎప్పటికైనా అడ్డంకేనని.. అవినాశ్, ఆయన తండ్రికి అర్థం కావడంతోనే ఈ హత్య జరిగిందన్నారు. "ఇవేమీ తెలియనట్టు, నిజం కానట్టు.. ఇప్పుడు వివేకా కుమార్తె సునీత భర్త హత్య చేయించాడంటూ అవినాశ్‌రెడ్డి మాట్లాడడం దారుణం. ఈ వ్యాఖ్యలు సునీత, ఆమె భర్తపై నెపాన్ని నెట్టే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. సునీతకు ప్రాణ హాని ఉందని తెలిసినా ధైర్యంగా పోరాటం చేస్తోంది. అన్నగా జగన్‌కు వీసమెత్తయినా కనికరం లేదు. నీ మనస్సాక్షిని అడుగు. సునీత బాధితురాలా?, కాదా?." అని షర్మిల నిలదీశారు. బుధవారం విశాఖ ఎయిర్‌పోర్టులో మీడియాతో ఆమె మాట్లాడారు. షర్మిల ఇంకా ఏమన్నారంటే.. వివేకా గుండెపోటుతో చనిపోయారన్న థియరీని సృష్టించింది సునీత అంటూ అవినాశ్ మాట్లాడుతున్నారు. కానీ, వాస్తవంగా వివేకా చనిపోయిన రోజు సునీత హైదరాబాద్‌లో ఉన్నారు. అదేరోజు ఉదయం 7 గంటల నుంచి గుండెపోటుతో చనిపోయినట్టు జగన్ మీడియాలో ప్రసారం చేశారు. మేమంతా అప్పుడు హైదరాబాద్‌లో ఉన్నాం. ఈ వార్త విని షాక్‌కు గురయ్యాం. జగన్ సొంత చానెల్‌లో గుండెపోటుతో చనిపోయినట్టు చూపించారు. లోకల్ న్యూస్ ఇచ్చే అవకాశం అక్కడే ఉన్న అవినాశ్‌కు ఉంటుందా? హైదరాబాద్‌లో ఉన్న సునీతకు ఉంటుందా?. రక్తపు మడుగులో పడి ఉన్న వివేకానందరెడ్డిని చూసిన ఎవరికైనా గుండెపోటు కాదని అర్థమవుతుంది. ఇది స్థానికంగా ఉన్న అవినాశ్ రెడ్డి ప్రభావితం చేసినట్టు కాదా?. అప్పట్లో గుండెపోటు అని ప్రచారం చేసిన దానిపై ఆ మీడియాను నడుపుతున్న భారతీరెడ్డి గానీ, జగన్‌గానీ ఇప్పటి వరకు ఎందుకు సమాధానం చెప్పలేదు. వివేకాను సునీత భర్త రాజశేఖర్‌రెడ్డి చంపించారన్నట్టుగా మాట్లాడుతున్నారు. అయితే వివేకానందరెడ్డి బావమరిదే రాజశేఖర్‌రెడ్డి. సునీత కంటే ఎక్కువగా వివేకాను ఆయన ప్రేమిస్తారు. అంత సన్నిహితంగా ఉండేవారు. అటువంటి ఆయన్ను ఎందుకు చంపుతారు. వివేకాకు కొడుకులేని లోటును రాజశేఖర్‌రెడ్డి తీర్చారు. అవినాశ్‌ను దోషిగా చూపిస్తే తనను వదిలేసి బీజేపీలోకి వెళ్లిపోతాడని జగన్ చెప్పారు. సీబీఐ విచారణ వేగవంతం చేయాలని సునీత ఎంతో ప్రాధేయపడింది. జగన్ ఒప్పుకోకపోవడంతోనే విభేదించి పోరాటం మొదలు పెట్టింది. బాధితుల పక్షాన నిలబడకుండా నిందితుల పక్షాన నిలబడ్డారంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే ఎంత బాధపడేవారో అందరికీ తెలుసు, చంద్రబాబును సునీత కలిసిందని ఆరోపణలు చేస్తున్నారు. మీరు న్యాయం చేయలేదు కాబట్టే చంద్రబాబును కలిసిందన్న విషయం తెలియదా?. సీబీఐ విచారణకు అడిగితే వేయలేదు కాబట్టే పోరాటం చేయాల్సి వచ్చింది. వివేకాను ఎవరు చంపించారన్న విషయం జగన్మోహన్‌రెడ్డికి తెలియదా?.ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం. 'అన్న' అనే పదానికి జగన్ కళంకం. సునీత పోరాటం చేస్తుంటే మీడియా ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం అన్యాయం.



## ఘనంగా దివ్యాంగుల సాధికారతకు "దివ్యాంగ శక్తి పథకం" ప్రారంభం

**కుప్పం, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమంగా "దివ్యాంగ శక్తి పథకం"ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ఈ పథకాన్ని ఘనంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి.ఎస్. మునిరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, పి.కె.ఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కడపిడి వికాస్ మరమ్మత్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాలు, సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి దివ్యాంగులకు వివరించారు. దివ్యాంగు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమాజంలో దివ్యాంగులు కూడా సమాన అవకాశాలు పొందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. "దివ్యాంగ శక్తి పథకం" ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడి, స్వయం సమృద్ధిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కడ అడ్వైజరీ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి త్రిలోక్, క్లస్టర్ ఇంచార్జీలు కన్నన్, సోము, ఏఎంసీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రేమ వేధింపుల కారణంగా యువకుడి హత్య

**ఇద్దరు నిందితులు అరెస్ట్**

**శాంతిపురం, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**



చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ముల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన నవాజ్ (19) అనుమానాస్పద మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఖాదర్ బాషా (50), షాహిన్ తాజ్ (42)లను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. మృతుడు నవాజ్, నిందితుల కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే అనుమానంతో కోపోద్రిక్తులైన నిందితులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇటుక రాయితో దాడి చేయడంతో నవాజ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఘటన అనంతరం పరారైన నిందితులను కుప్పం ఎస్‌డీపీఓ బి. పార్థసారధి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి పట్టుకున్నాయి. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



## తితిదే ప్రసాదాల్లో కల్తీకి చెక్

- అత్యాధునిక 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' ల్యాబ్ ఏర్పాటు
- పీపీటీ స్థాయిలో అతి సూక్ష్మ కల్తీ పదార్థాల గుర్తింపు
- రూ.20 కోట్లతో భవన నిర్మాణం
- 21న సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభం

**తిరుపతి, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదాల స్వచ్ఛతను కాపాడేందుకు..ముడిసరకుల్లో ఏమాత్రం కల్తీ జరిగినా ఇట్టే పసిగట్టేందుకు తిరుమలలో అత్యాధునిక ఎఫ్ఎస్-ఎస్ఏఐ ల్యాబ్‌ను తితిదే నెలకొల్పింది. దేశంలోని మరే దేవాలయంలోనూ లేని విధంగా, అత్యాధునిక సాంకేతికత, ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈ ల్యాబ్‌ను ఈ నెల 21న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు.కేంద్ర ప్రభుత్వ నిధులతో, తితిదే, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చింది. మొత్తం 12వేల చ.అ.విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. ల్యాబ్ ఏర్పాటుకు రూ.19.75 కోట్లు, జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం మరో రూ.60 లక్షలు వెచ్చించారు. ఇంతకుముందు కల్తీని పీపీఎం స్థాయిలో గుర్తించేవారు. ఇకపై ఈ ల్యాబ్‌లోని అత్యాధునిక పరికరాలతో పీపీటీ (పార్ట్స్ పర్ ట్రిలియన్) స్థాయిలో..అంటే అత్యంత సూక్ష్మమైన కల్తీని సైతం ఇట్టే పసిగడతారు. ల్యాబ్ కింది అంతస్తులో రసాయనాల విశ్లేషణ, ముడిసరకుల ఫిజికల్, కెమికల్ ఎనాలిసిస్ నిర్వహిస్తారు. పురుగులు ఉన్నాయా, డ్యామేజ్ ఉందా.. నెయ్యి, నూనెల్లో ఎసిడిటీ, ఐవీ వాల్యూ వంటివి పరీక్షిస్తారు. తాగునీటిలో క్లోరైడ్, సల్ఫేట్, మెగ్నీషియం శాతాన్ని కూడా లెక్కిస్తారు. ఎల్సీఎంఎస్, ఐసీపీ-ఎంఎస్: సుమారు రూ. 2.5 కోట్ల విలువ చేసే ఎల్సీఎంఎస్, ఐసీపీ-ఎంఎస్ పరికరాలు ఈ ల్యాబ్‌లో కీలకమైనవి. నూనెలు, పాలు, నెయ్యిలో పెస్టిసైడ్స్, యాంటీబయాటిక్స్, అఫ్లోటాక్సిన్స్ (బూజు నుంచి వచ్చేవి), ప్రిజర్వేటివ్స్, విటమిన్ డ్రగ్స్‌ను పసిగడతాయి.



## జగ్గయ్యపేటలో
# 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం

### ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదుగా లాంఛనంగా ఆరంభం

**జగ్గయ్యపేట, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

ఉగాది పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న ప్రత్యేక కానుకగా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని జగ్గయ్యపేట పట్టణంలో ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ పథకాన్ని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11.16 లక్షల మంది దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఉగాది కానుకగా ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం దివ్యాంగుల జీవితాల్లో సౌలభ్యాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అనేక ప్రాధాన్యతా కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దివ్యాంగులకు పెన్షన్‌లను పెంపు చేయడం, ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి కోసం రుణాలు మరియు సబ్సిడీలు అందించడం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు పంపిణీ చేయడం, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రజా ప్రదేశాల్లో సౌకర్యవంతమైన మౌలిక వసతులు (రాంపులు, ప్రత్యేక మరుగుదొడ్లు) ఏర్పాటు చేయడం వంటి చర్యలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ప్రత్యేక చికిత్స సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో పని చేస్తుందని, వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, దివ్యాంగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిఐటీయు నూతన అధ్యక్షుడుగా ఎం. అయ్యప్ప ఎన్నిక




**ఆగిరిపల్లి, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో ఉన్న కుశలవ కంపెనీలో సిఐటీయు జనరల్ బాడీ సమావేశం, 6వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహ రావు హాజరయ్యారు. అలాగే కుశలవ యూనియన్ అధ్యక్షులు, సిఐటీయు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ, సిఐటీయు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్ వీడి ప్రసాద్, ఉపాధ్యక్షులు జి రాజు, ఆగిరిపల్లి మండల కన్వీనర్ రాజులపాటి చంటి, గ్రామ కార్యదర్శి ఎం. నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్ నరసింహ రావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, శ్రమదోపిడి, లేబర్ కోడ్స్‌లోని కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. కార్మికులు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలరని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుశలవ సంస్థకు చెందిన నూతన కమిటీని 31 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. అయ్యప్ప, ప్రధాన కార్యదర్శిగా బి.ఎన్.ఎస్. శ్రీనివాస్, కోశాధికారిగా జె. సామ్యూల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.వి.కె. ప్రసాద్ ఎన్నికయ్యారు. పేత్రు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కుశలవ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నూజివీడులో నవజీవన్ బాల భవన్ సందర్శించిన ఐజీ రవికృష్ణ



**నూజివీడు, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

ఏలూరు జిల్లా నూజివీడులోని బోస్కోడి ఎడ్యుకేషన్ సెంటర్ పరిధిలో ఉన్న మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం 'నవజీవన్ బాల భవన్'ను ఐకే రవికృష్ణ, బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవజీవన్ బాల భవన్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని ప్రశంసించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న 16 మంది బాలలతో కొంత సమయం గడిపి, వారికి ధైర్యం నింపుతూ చెడు వ్యసనాలను వదిలి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తాను గుంటూరు ఎస్పీగా ఉన్న సమయంలో 'ఆపరేషన్ స్ట్రీట్ చిల్డ్రన్' చేపట్టి వీధి బాలలను రక్షించి విద్యలో చేర్పించిన అనుభవాన్ని గుర్తుచేశారు. మత్తు పదార్థాల సమస్యపై మౌనం సమాజానికి ప్రమాదకరమని, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం గమనిస్తే వెంటనే 1972కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి చైతన్యంగా ఉంటే సమాజాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించవచ్చని, "నైబర్‌హుడ్ పోలీసింగ్" ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరగాలని సూచించారు. విద్యార్థులు మొదట సిగరెట్లు, తర్వాత మద్యం, అనంతరం డ్రగ్స్ వైపు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానంతో పనిచేస్తోందని, త్వరలో డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులోకి తెచ్చి సర్ప్రైజ్ చెక్స్ నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వినియోగదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ,ఆపరేషన్ గరుడ', 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్', 'ఆపరేషన్ వజ్రప్రహార్' వంటి కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్డీపీఎస్ చట్టం కింద డ్రగ్స్ కేసుల్లో కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ఫాదర్ మరెడ్డి, ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ బాబు, ఇంచార్జి ఆంజనేయులు, డాక్టర్ సుధీర్, సైకాలజిస్ట్ అనూషతో పాటు పోలీసులు, ఈగల్ బృందం సభ్యులు పాల్గొన్నారు. ఐజీ, ఎస్పీ పిల్లలతో కలిసి సమయం గడిపి, వారికి పండ్లు పంపిణీ చేసి భోజనం చేశారు.

## లీగ్ దశలో కృష్ణా యూనివర్సిటీ
# అంతర్ కళాశాలల పురుషుల ఖో-ఖో పోటీలు





**విజయవాడ, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

స్థానిక పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల పురుషుల ఖో-ఖో పోటీలు లీగ్ దశకు చేరాయి. ఈ పోటీలలో మొత్తం ఎనిమిది కళాశాలలు పాల్గొన్నాయి. పోటీలు నాకౌట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహించబడ్డాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్ లలో ఆంధ్ర లయోలా కాలేజ్, విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మధ్య జరిగిన పోటీలో ఆంధ్ర లయోలా కాలేజ్ విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్ లో పి.బి సిద్ధార్థ కళాశాల వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ పై విజయం సాధించింది. పి.బి సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మేక రమేష్, ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్ పోటీలను తిలకించారు. వర్షం కారణంగా పోటీలకు అంతరాయం కలగటంతో మిగిలిన పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు.

# సీఆర్‌డీఏ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ

- రాజధాని పనుల్లో మైన్స్ శాఖ భాగస్వామ్యం కీలకం
- తాజాగా ఆరు క్వారీ లీజులకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదం
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

నవ్య రాజధాని అమరావతి పనులకు సంబంధించి సీఆర్‌డీఏ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికతో జిల్లా మైన్స్ శాఖ లీజుల సత్వర అనుమతులపై దృష్టిసారిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం జరిగింది. మైన్స్‌తో పాటు రెవెన్యూ, అటవీ, సీఆర్‌డీఏ, పర్యావరణం తదితర విభాగాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో రాజధాని పనులకు సంబంధించి సీఆర్‌డీఏ అవసరాలు, జిల్లా సమన్వయ శాఖల భాగస్వామ్యం, ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్, ఇతర మెటీరియల్ సరఫరాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని.. ఇప్పటికే దాదాపు 11 లక్షల టన్నుల గ్రావెల్‌కు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. మరో ఆరు క్వారీ లీజులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. వీటిలో అయిదు ప్రాంతాలకు తాత్కాలిక అనుమతులిచ్చినట్లు తెలిపారు. లీజు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు మైన్స్ శాఖ.. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కూడిన బృందాలు ప్రత్యేకంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కీలకమైన నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) జారీకి రెవెన్యూ, అటవీ, పీసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి కీలకమైన ప్రాజెక్టు కావడంతో, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేందుకు వీలుగా ఎప్పటికప్పుడు సమన్వయ శాఖల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ అభివృద్ధి పనులు ముందుకు సాగేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ అంశాన్ని జిల్లాస్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ కుమార్, సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారి బి.శ్రీనివాసరావు, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో జి.సతీష్, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పరాభవనామ సంవత్సరంలో వైభవంగా ఉండాలి

- ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉగాది శుభాకాంక్షలు



**విజయవాడ, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

అజ్ఞానం, అహంకారం, బలహీనతలను జయించి ఉన్నత స్థితికి ఎదిగేందుకు ప్రతీక అయిన శ్రీ పరాభవనామ సంవత్సరం జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త విజయాల వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజల సంస్కృతిలో ఉగాది పండుగకు విశిష్ట స్థానం ఉందని, ఇది కేవలం కొత్త సంవత్సర ఆరంభం మాత్రమే కాకుండా ఆలోచనలు, ఆశయాలను పునర్నిర్మించుకునే ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖదుఃఖాలను సూచిస్తాయని, కష్టాలను కూడా సానుకూల దృక్పథంతో స్వీకరించి ముందుకు సాగితేనే నిజమైన విజయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతికూల ఆలోచనలను దూరం చేసి సానుకూల దృక్పథంతో జీవించాలని, అహంకారాన్ని విడిచి వినయంతో ముందుకు సాగితే సమాజం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ ఉగాది ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఎన్‌టీఆర్ జిల్లా విద్య, వ్యవసాయం, వాణిజ్యం పారిశ్రామిక, పర్యాటకం తదితర రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని కోరుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## షేర్ మహమ్మద్‌పేట ప్రభుత్వ పాఠశాలలో
# ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్)**



జగ్గయ్యపేట మండలం, షేర్ మహమ్మద్‌పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల మరియు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచి, పరిశుభ్రత, పోషక విలువలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం స్కీం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చదువుపై ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే వారు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మెనూ ప్రకారం పోషకాహారం వండి విద్యార్థులకు సమయానికి అందించాలని వంట సిబ్బంది మరియు సంబంధిత అధికారులకు సూచించారు. పిల్లల ఆరోగ్యం, చదువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

అలాగే పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులు మరియు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సక్రమంగా చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారికి ఉత్తమ విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపి వారి చదువులు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

## పంచరెడ్డి సురేష్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది

**భౌతికకాయానికి నివాళులర్పించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : బీజేపీ నాయకుడు,మాజీ కార్పొరేటర్ పంచ రెడ్డి సురేష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త విచారం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే బుధవారం హుటాహుటిన ఇందూరుకు చేరుకొని,ఆయన భౌతిక కాయానికి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడు సురేష్ అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు.ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన సతీమణి పంచరెడ్డి అనిత భారీ మెజారిటీతో విజయం సాధించడం వెనక సురేష్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.అందరినీ కలుపుకొనిపోయే మనస్తత్వం ఉన్న నాయకుడని తెలిపారు.కార్పొరేటర్ గా ప్రజాసేవ చేస్తూ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడని కొనియాడారు.మృదుస్వభావిగా పేరు తెచ్చుకున్న ఆయన గుండెపోటుకు గురికావడం తీవ్రంగా కలచివేసిందన్నారు.వారి కుటుంబానికి బీజేపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.అనంతరం కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు.

## ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన 22వ వార్డు కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి



(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ మార్చి 19 : వికారాబాద్ పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వార్డు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరంగా భావించే ఉగాది పండుగ ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే ప్రత్యేకమైన రోజు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఐక్యంగా ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ ఆరోగ్యం, అభివృద్ధి, విజయాలు కలగాలని కోరుకుంటూ, తమ వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## ఏకలవ్య గురుకులంలో అవుట్సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలోని ఇందల్వాయి ఏకలవ్య గురుకులంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తాత్కాలిక పద్ధతిన ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ నెల 20 నుండి 25 తేదీ వరకు పీజీటీ కెమిస్ట్రీ (01),సైకాలజీ కౌన్సిలర్ (01),ఎంబీఏ రిటైలర్ (01),గార్డెనర్ (01),మెస్ హెల్పర్ (01),స్లీపింగ్ అండ్ శానిటేషన్ (02) పోస్టులకు దరఖాస్తులను బీబీపూర్ తాండాలో గల ఈఎంఆర్ఎస్ గురుకులంలో స్వీకరిస్తామన్నారు.వీరి నియామక ప్రక్రియ పూర్తి తాత్కాలికమని,ఈ విద్యా సంవత్సరం కొరకు మాత్రమే కొనసాగిస్తామన్నారు.పోస్టుకు తగిన అర్హతలు పాఠశాలలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.నిజామాబాద్ జిల్లా స్థానిక బోనఫైడ్ అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు.పూర్తి వివరాల కోసం9492357892/9696623631 సంప్రదించాలన్నారు.మెరిట్ ఆధారంగా మాత్రమే నియామకాలు జరుగుతాయన్నారు.

## కాకి ఈశ్వర్ కుమారుడి రిసెప్షన్ కు హాజరైన నాయకులు

**బ్రాహ్మణపల్లిలో ఘనంగా శివరామకృష్ణఉషారాణి రిసెప్షన్**

**నూతన వధూవరులకు ప్రముఖుల ఆశీర్వాదం**



(జర్నలిస్ట్ ఫైల్)ప్రతినిధి మహేశ్వరం మార్చి 19 : బ్రాహ్మణపల్లి గ్రామంలోని పిఎం ఎస్ జె ఫంక్షన్ హాల్లో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్ కుమారుడు కాకి శివరామకృష్ణఉషారాణి వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్మ మోహన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్టు వత్తుల రఘుపతి, జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కర్ణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు వత్తుల నారాయణ, ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండల అధ్యక్షులు కాకి కుమార్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మండల చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, గ్రామ పంచాయతీ నాలుగో వార్డ్ సభ్యులు సంజీవ, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శంకర్, జర్నలిస్టు బంటు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతర్ల సాంబయ్య యాదవ్, వరకల యాదగిరి గౌడ్, ఇంద్రకంటి నరసింహ గౌడ్, కాకి శ్రీశైలం ముదిరాజ్ తదితరులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య స్నేహితులు, బంధువుల సమక్షంలో విజయవంతంగా జరిగింది.

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు పోలీస్ కమిషనర్ వెల్లడి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : "శ్రీ పరాభవ నామ" సంవత్సర ఉగాది సందర్భంగా ప్రజలందరు ఎలాంటి అభద్రతా భావంతో లేకుండా సుఖశాంతులతో ఉండాలని నిజామాబాద్ కమిషనరేటు పరిధిలోని ప్రజలందరకి పోలీస్ శాఖ తరపున "ఉగాది శుభాకాంక్షలు" తెలియజేయుచున్నాను అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.

## అత్తాపూర్ సర్కిల్లో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించేందుకు జోనల్ కమిషనర్(ఐఏఎస్)మండా మకరందు పర్యటన.



రాజేంద్ర నగర్, మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్ర నగర్ జోన్ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్లో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించేందుకు జోనల్ కమిషనర్ మండా మకరందు,ఐఏఎస్ పర్యటించారు.ఈ పర్యటనలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య,డీఈఈ తిరుపతి,ఏఈఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) ఆశిష్ తివారి ఇతర పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వే పరిధిలోని ముఖ్య ప్రాంతాలను పరిశీలిస్తూ,అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను జోనల్ కమిషనర్ సమీక్షించారు.ప్రతిరోజూ ఎలాంటి విరామం లేకుండా క్రమం తప్పకుండా వీధి ఊడ్చివేత,ఇతర పారిశుద్ధ్య కార్యకలాపాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.అదేవిధంగా పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్పై పరిశుభ్రతను కచ్చితంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు.ముఖ్యంగా ప్రధాన రహదారుల వెంట పేరుకుపోయిన నిర్మాణ,కూల్చివేత (సి,డి) వ్యర్థాలను తక్షణమే తొలగించాలని ఆయన ఆదేశించారు,తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రవాణా సౌలభ్యం మెరుగుపడుతుంది. అదనంగా,పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని,ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు పెంచాలని,సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతూ,పబ్లిక్ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అత్తాపూర్ సర్కిల్ను పరిశుభ్రంగా,ఆరోగ్యకరంగా ఉంచడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని జోనల్ కమిషనర్ పేర్కొంటూ,సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలను ముందు నెరవేర్చాలి**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ ముట్టడి చేస్తామని అంటున్నారని బిజెపి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదు అని ముట్టడి చేస్తారా లేక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నందుకు ముట్టడి చేస్తున్నారా అని నగేష్ రెడ్డి ప్రశ్నించారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు నల్లధనాన్ని బయటకు తీస్తామని ప్రతి పేదవాని అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పి ఇప్పటివరకు నల్లధనాన్ని బయటకు తీయనందుకు ముట్టడి చేస్తారని,సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు అని,స్థానిక ఎంపీ కేంద్రం నుండి నిజామాబాద్ జిల్లాకు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేదని జిల్లా అభివృద్ధి గురించి ఎంపీ ఆలోచించిందే లేదు అని,మాధవనగర్ బ్రిడ్జి గత ఏడు సంవత్సరాలుగా నత్తనడకన నడుస్తున్న స్థానిక ఎంపీ పట్టించుకున్న పాపాన లేదు అని నగేష్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్ డిక్లరేషన్ లో చెప్పిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుంది అని నగేష్ రెడ్డి అన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరుగుతుంది అని,ఇల్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుంది అని,గత పది సంవత్సరాలలో రాష్ట్రంలో టిఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదు అని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 24 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని,అదేవిధంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ప్రభుత్వమే అందిస్తుంది అని,ఎందుకంటే గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం ద్వారా ప్రజలు వాటిని తినలేక దళారులకు అమ్ముకొని నష్టపోవడం జరిగిందని ఆయన అన్నారు.అదేవిధంగా రైతు సోదరుల కొరకు రైతు రుణమాఫీ చేయడం జరిగిందని,సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం,రైతు భరోసా ద్వారా ఎకరానికి సంవత్సరానికి 12,000 రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుంది అని,పేద కుటుంబాలకు రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుంది అని,ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు పెంచడం జరిగిందని,మహిళా సోదరీమణుల కొరకు ఉచిత బస్సు సౌకర్యం అందించడం జరిగిందని,80,000ఉద్యోగాలు రాష్ట్రంలో కల్పించడం జరిగింది అని నగేష్ రెడ్డి అన్నారు.గత పది సంవత్సరాలలో బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు లోపాయికర ఒప్పందాలతో పరిపాలన చేసి అభివృద్ధిని గాలికి వదిలేసారని,బిజెపి రైతుల పక్షాన పేద ప్రజల పక్షాన ఆలోచించడం మానేసి కేవలం కార్పొరేట్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారు అని,కార్పొరేట్ సంస్థల వారికి సబ్సిడీలు ఇవ్వడం జరుగుతుంది కానీ రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో విఫలం అయ్యిందని,నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది.మంచి విషయమే కానీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు మద్దతు ధర ప్రకటించడం లేదు అని నగేష్ రెడ్డి ప్రశ్నించారు.మద్దతు ధర ప్రకటించినప్పుడే పసుపు రైతులకు న్యాయం జరుగుతుంది అని నగేష్ రెడ్డి అన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ హయాంలో క్రూడ్ ఆయిల్ ధర 140 ఉన్న సందర్భంలో పెట్రోల్ 70 రూపాయలు,డీజిల్ 60 రూపాయలకు అందించడం జరిగిందని,కానీ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రూడాయిల్ ధర తగ్గినప్పటికీ పెట్రోల్ ధరను 110 రూపాయలకు,డీజిల్ ధరను 97 రూపాయలకు పెంచడం జరిగిందని,వంట గ్యాస్ సిలిండర్ ధరను కూడా 400 నుండి 1000 రూపాయలకు పైగా చేయడం జరిగిందని బిజెపి ప్రభుత్వం ఎన్ని వైఫల్యాలకు కారణమైన కూడా బిజెపి నాయకులు సిగ్గు లేకుండా 21వ తేదీన ముట్టడి చేస్తామని చెప్పడం అనేది ఏదైతే ఉందో దానిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని నగేష్ రెడ్డి అన్నారు.బిజెపి నాయకులు ముందు వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత మాట్లాడాలి తప్ప వారు తప్పుచేసి ఎదుటి వారిపై నిందలు వేయకూడదు అని,బిజెపి చేస్తున్న ముట్టడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని నగేష్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ శేఖర్ గౌడ్,సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం,కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## టి ఎల్ ఐ ఎఫ్ పద్ధతి లో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పటల్ లో వెన్నెముక సమస్యలకు మెరుగైన వైద్యం



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పటల్ డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతానికి చెందిన కందుల సూరమ్మ వయసు 55 సంవత్సరాలు అత్యంత తీవ్రమైన వెన్నుపూస నొప్పితో బాధపడుతూ హాస్పిటల్ కు వచ్చిందని వెంటనే ఎక్రే తీసి ఎం ఆర్ ఐ స్కానింగ్ చెయ్యగా వెన్నుపూస ముందుకు జారి నరాలు బలహీనతగా మారాయని గుర్తించారు . ఆమెకు చాలా మెరుగైన పద్ధతి లో టి ఎల్ ఐ ఎఫ్ ( ట్రాన్స్ఫోర్నల్ లంబా ఇంటర్ బాడీ ఫీజనల్ సర్జరీ ) ని చేసి జారిన వెన్నుపూసను యధావిధి స్థానానికి తీసుకొచ్చి ఫిక్స్ చేశామని అన్నారు . ఈ సర్జరీలో నరాలు డ్యామేజ్ అయే పరిస్థితులు ఏర్పడతాయి సమ్ టైం ఆ నరాల్లో ఉండే బలం తగ్గిపోతుందని అన్నారు . ఎక్కువ శాతం ఒంగి లేదా బరువు పనులు చేసే వారికి ఈ సమస్య వస్తుందని దీనివలన డే బై డే పనులు చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు . అత్యంత క్లిష్టమైన వెన్నెముక సమస్యల పరిష్కారంలో కూడా డాక్టర్ మదుకిరణ్ ఎంతో నమ్మకమైన వైద్యులు . గతంలో విఫలమైన సర్జరీలను సరిచేయడం ( రివిషన్ సర్జరీస్ ) , వెన్నెముకలో పలుచోట్ల ఎముకలను అతికించడం (మల్టీ – లెవెల్ ఫ్యూషన్స్) , తీవ్రమైన వెన్నెముక గాయాలు, కణితుల (తుమర్స్ ) వంటి కేసులను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తారు . ఆపరేషన్ కంటే ముందే కంప్యూటర్ సహాయంతో చేసే ప్లానింగ్, ఆపరేషన్ సమయంలో నరాలకు హాని జరగకుండా చూసి 'న్యూరో-మానిటరింగ్' వంటి పద్ధతుల ట్రీట్మెంట్ చేస్తారన్నారు .సంక్లిష్టమైన వెన్నెముక వైకల్యాల శస్త్రచికిత్స సవరణ , మినిమల్లీ ఇన్వాసివ్ స్పైన్ కెర్లో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు . సింగపూర్లోని ఎన్ యూ హెచ్ ఎస్ తో సహా ప్రముఖ అంతర్జాతీయ సంస్థలలో శిక్షణ పొంది స్కోలియోసిస్ సవరణ , మోషన్ ప్రిజర్వింగ్ వెన్నెముక ప్రక్రియలు, నొప్పిని, కోలుకునే సమయాన్ని మరియు శస్త్రచికిత్స ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించే హై-ప్రిసిషన్ మినిమల్లీ ఇన్వాసివ్ టెక్నిక్స్లో చేసిన కృషికి విస్తృత గుర్తింపు పొందారు . ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు , బాలకృష్ణ , నాగార్జున పాల్గొన్నారు .

## ఎస్.ఎస్.సి పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : బుధవారం ఎస్ ఎస్ సి పబ్లిక్ ఎగ్జామ్ రెండవ పేపర్ అయినా హిందీ,తెలుగు నిర్వహించడం జరుగుతుంది.నిజామాబాద్ నగరంలో గల ఎస్ ఎఫ్ ఎస్ హైస్కూల్,రవి స్కూల్ పరీక్ష కేంద్రాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల చుట్టూ ముట్టు ఎలాంటి జిరాక్స్ సెంటర్లను తెరిచి ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,ఎలాంటి మాస్ కాపింగ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా త్రీ టౌన్ పి.ఎస్ ఎస్.ఐ జి.నారాయణ,హెడ్మాస్టర్ ఆనంద్,సిట్టింగ్ స్క్వాడ్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ,మల్లికార్జున్ సిఎస్,నవీన్ డిపార్ట్మెంటల్ అధికారి తదితరులు పాల్గొనడం జరిగింది.

## కే యం డి సి లో ఉగాది వేడుకలు



ఖమ్మం, మార్చి 19(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం లో గల స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం మరియు అంతర్గత నాణ్యత ప్రమాణాల విభాగం అధ్వర్యంలో శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మామిళ్ళపల్లి కోటాచార్యులు (పి.హెచ్.డి. సంస్కృతం అండ్ టీటీడీ గరుడ పురాణం అండ్ పంచాంగ శ్రవణకర్త) పాల్గొని పంచాంగ శ్రవణం, రాశి ఫలాల గురించి వివరించారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించడం జరిగింది. విద్యార్థులు అధ్యాపకులు సాంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఉగాది కవితలను వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్





కె.వి.రమణారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. సి.హెచ్ ఆంజనేయులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్. ఎం.రంగారావు వివిధ విభాగాల అధిపతులు ఐక్యూఏసి కోఆర్డినేటర్ అజయ్ కుమార్ చైతన్య అధ్యాపకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క వేడుకలను విజయవంతం చేశారు.

## యూనివర్సిటీ న్యాయ కళాశాలలో భారత కెనడా సంస్కృతుల సంఘర్షణపై అంతర్జాతీయ సెమినార్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ విశ్వవిద్యాలయ న్యాయ కళాశాలలో బుధవారం భారత – కెనడా సంస్కృతుల సంఘర్షణ పై ఆన్లైన్ విధానంలో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు.ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ.... భారత్ కెనడా దేశాల మధ్య కుటుంబ సాంప్రదాయ,వ్యక్తిగత అంశాలలో అనేక రకాల వ్యత్యాసాలు ఉన్నట్టు తెలిపారు.భారతీయులు కెనడాలో జీవనం సాగించడానికి వారి వ్యక్తిగత,కుటుంబ సామాజిక అంశాలలో రాజీ పడవలసిన అవసరం ఏర్పడుతుందని,లేనట్లయితే మనుగడ కష్టమని తెలిపారు.భారత సంప్రదాయాలు,వంటకాలు,పండుగలు వ్యక్తిగత అవసరాలు,కోరికలు,ఆశలు కెనడా సమాజ సంప్రదాయాలు జీవన విధానాలతో ముడిపడలేక సంఘర్షణకు గురవుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవిభాగ అధ్యక్షురాలు డాక్టర్.ప్రసన్న రాణి,చైర్ పర్సన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్. బి.స్రవంతి,విభాగ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్.జెట్లింగ్ ఎల్లోసా పాల్గొన్నారు.విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ సంబంధాల విషయాలను ఆసక్తితో తెలుసుకున్నారు.

## మృతుల కుటుంబాలకు బియ్యం పంపిణీ




వరంగల్ ప్రతినిధి మార్చి 19 (జర్నలిస్ట్ ఫైల్) : హనుమకొండ జిల్లా పురపాలక మున్సిపాలిటీ పరకాల పట్టణంలో రాజిపేట అంబేద్కర్ సెంటర్ నందు ఇటీవల అనారోగ్యాలతో మరణించిన కుటుంబాలను బుధవారం రాజిపేటలో మృతుల కుటుంబాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సీఐ ఒంటేరు రమేష్ పరామర్శించారు. బాధితుల ఇంటికి వెళ్లి, మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతికి కారణాలు తెలుసుకొని, ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి ఆధ్వర్యంలో 4 మంది మృతుల కుటుంబాల ఇంటింటికి 25 కిలోల బియ్యం బ్యాగును అందించారు.ఆయన వెంట ఏకు (గడ్డం)రమేష్, బోట్ల నరేష్,ఒంటేరు సురేష్,ఒంటేరు బాబు, బొచ్చు రాజు స్వేరో తదితరులున్నారు.

## డ్రైనేజ్ కాలువల నిర్మాణం లో డొల్లతనం

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వివిధ డివిజన్లలో నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ కాలువ నిర్మాణాలు డొల్లతనం కనిపిస్తున్నాయని, నాణ్యత లోపం ఉన్నాయని స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలను ఎదురవుతున్నాయి. ఏదో మొక్కుబడిగా తమ పనులు నిర్వహిస్తున్నారు, తప్ప నాణ్యత విషయంలో ప్రమాణాలు పాటించడం లేదని సైడ్ కాల్వలకు అమర్చిన స్లాబ్ రేకులను రాత్రి వేసి తెల్లారి కల తీసివేస్తున్నారు. నాణ్యత లోపం వల్ల సిమెంట్ దిమ్మలు విరిగిపోతున్నాయి, గుంటలు పడుతున్నాయి అని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు సైతం కొన్నిచోట్ల పర్యవేక్షణ నిర్వహించకుండా దరిదాపులకు రాకుండా పనులు నిర్వహిస్తున్నట్లు ఆక్షేపిస్తున్నారు. కల్వర్టులు సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది. క్యూరింగ్ సైతం మొక్కుబడిగా చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. సగం కాలువలు వేసి మిగతా సగం ఆలస్యంగా వేస్తున్నారు. ఎవరైనా కార్మికులను వర్కర్లను ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెప్పటం చోటు చేసుకుంది. కాంట్రాక్టర్లు చెప్పినట్లు తాము చేస్తున్నామని వారు చెబుతున్నారు. నాణ్యత లోపం వల్ల ఆ కాలువలపై ఇంటి యజమానులు దారి కోసం స్లాబ్ వేసుకుంటే అవి నిలుస్తాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. నగర కార్పొరేషన్ పరిధిలోని అన్ని ఓపెన్ కాలువలు నిర్మాణం వల్ల ప్రమాదాలు సంభవించి ఆస్కారం ఉంది. కావున క్లోజ్ కాలువల నిర్మాణం చేపట్టాలని ఓపెనింగ్ గా ఉన్న వాటిని క్లోజ్ గా చేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కార్పొరేటర్ లను కోరుతున్నారు. వాటిని నివారించేందుకు సత్వర చర్యలు గైకొనాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

## త్రివేణి లో ఘనంగా పంచాంగ శ్రవణం



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : త్రివేణి పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఉదయమే పాఠశాల ఆవరణలో పూజానంతరం పురోహితులు, గణితశాస్త్ర అధ్యాపకులు మరింగంటి కాశ్యపాచార్యులు పంచాంగ శ్రవణం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా ఇచ్చారు ఈ సందర్భంగా పురోహితులు ఉగాది పండుగ యొక్క ప్రాశస్త్యం, షడ్రుచులు ఏ విధంగా మానవ జీవితానికి ప్రతీకలుగా ఉంటాయి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఉగాది పండుగ మన పండుగలలో మొదటిదని ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా జీవితంలో వచ్చే అన్ని ఒడిదుడుకులను సానుకూల దృక్పథంతో స్వీకరించి ఉన్నత మానవులుగా ఎదగాలని విద్యార్థుల పట్ల ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని,అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ,ఈ ఉగాది అందరి జీవితంలో అద్భుతమైన ఫలితాలను ఇవ్వాలని ఆకాంక్షిస్తూ అందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ




వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్ పోర్ట్ ఇంచార్జి సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉగాది సందర్భంగా ఏపీ ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా 5కే వాక్



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉద్యోగుల్లో ఉత్సాహం, శారీరక–మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఏపీ ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే వాక్ కార్యక్రమం గుంటూరులో ఘనంగా జరిగింది.

జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు ఎన్టీఆర్ స్టేడియం వద్ద వాక్‌ను ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ వాక్ హరిహర మహల్ మీదుగా రింగ్ రోడ్ మార్గంలో సాగి తిరిగి స్టేడియం వద్దకు చేరుకుని విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో పెరుగుతున్న పనిఒత్తిడి, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు శారీరక ఆరోగ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం, నడకకు కేటాయిస్తే శరీరం దృఢంగా ఉండటంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. ఆరోగ్యవంతమైన ఉద్యోగి మాత్రమే తన విధులను సమర్ధవంతంగా నిర్వహించగలడని స్పష్టం చేశారు. నూతన సంవత్సరంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యంపై నిర్లక్ష్యం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇటువంటి వాక్ కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందించడమే కాకుండా ఆరోగ్యంపై చైతన్యం కలిగిస్తాయని తెలిపారు.

కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంఘ బలం, ఐక్యతకు నిదర్శనమని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్. అనిల్, బి. కృష్ణకిషోర్, జానీ భాషా, నరసింహారావు, విజయ్, సిటీ కార్యదర్శి కళ్యాణ్ కుమార్, సిటీ కార్యవర్గ సభ్యులు అంకమ్మరావు, భావనారాయణ, విజయ్ భాస్కర్, శ్రీనివాసరావు, మరీలు, వెంకటరెడ్డి, శేషగిరి రాజు, పాల్ ప్రసాద్, పూర్ణయ్య, జోసఫ్, నాగేశ్వరరావు, మహిళా విభాగం సభ్యులు శైలజ, ప్రసన్న, జసింత, శ్రీ వాణి తదితరులు పాల్గొన్నారు.

## షడ్రుచుల గుణ సంగమం జీవనగమనం ఎమ్ ఆర్ కె శర్మ



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):షడ్ రుచులో ఉన్న సుగుణాలు మనిషిలో కూడా పెంపొందించుకుంటూ జీవితంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలను గమనించుకుంటూ జీవితంలో ముందుకు వెళ్ళాలన్నదే ఉగాది పండుగ ద్వారా చాటే నీతి అని వాస్తు జ్యోతిష్య సిద్దాంతి మోదుకూరు రాధాకృష్ణ శర్మ పంచాగ శ్రవణ కార్యక్రమంలో పేర్కొన్నారు.స్థానిక పినపాడులోని తెలుగుసాహితీ సౌరభం కార్యాలయంలొ గురువారం శ్రీపరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుసాహితీ సౌరభం సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు వాస్తు, జ్యోతిష సిద్దాంతి మోదుకూరు రాధాకృష్ణశర్మ పంచాంగ పఠనం ద్వారా శ్రీ పరాభవనామ సంవత్సర ఆవశ్యకతను వివరించారు. గ్రహ సంచారం, నవ నాయకుల స్థితి గతులు, మేషం నుండి మీనం వరకు, వ్యక్తిగత రాశీ ఫలితాలు వివరించారు.పలువురు తెలుగు పండితులు ఉగాది పండుగ, షడ్ రుచుల వేపపూత పచ్చడి ప్రాధాన్యతను వివరిస్తు చక్కని కవితల ద్వారా పండుగ గొప్పతనాన్ని వివరించారు.కార్యక్రమంలొ సూర్యప్రకాశరావు, లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, డివి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సిధ్ధాంతిరాధాకృష్ణను సభ్యులు సముచిత రీతిన సత్కరించారు.

## ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు



○ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):శ్రీ పరాభవ నామ సంవత్సరాది ఉగాది సందర్భంగా రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి సాంప్రదాయ పంచ కట్టు, భుజాన కండువాతో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్రప్రజలకు అన్నీ శుభాలు జరగాలన్న అభిలాషను వ్యక్తం చేశారు. అందరికీ విజయాలు సిద్ధించాలని కోరుకున్నారు. సమృద్ధిగా వానలు కురవాలని.. పంటలు బాగా పండాలని.. రైతులకు మేలు కలగాలని.. సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని.. తద్వారా యావత్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని ఆయన అభిలషించారు. మన సంస్కృతి సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

హైదరాబాద్ జర్నలిస్ట్ ఫైల్):తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను రాష్ట్ర ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు.ఇక, అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు.

## 21న వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణస్వీకార ఉత్సవం

○ హాజరుకానున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు

○ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలి

○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో నియోజక వర్గ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులకు సూచించారు.

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులొ ఈనెల 21న, సాయంత్రం వ్యవసాయ మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకార ఉత్సవాన్ని కూటమి పార్టీల ప్రతిష్టను చాటేతీరుగా నిర్వహించనున్న క్రమంలొ గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 21వ తేదీ కూటమి నాయకులందరూ కలిసి శివాజీచౌక్ నుండి ర్యాలీగా మార్కెట్ యార్డు ప్రాంతానికి చేరుకోవాలని సూచించారు. ఈవిశిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి,గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ మంత్రిఅచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి వర్యులు,తెనాలి ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేశ్,నాదెండ్ల మనోహర్,పిల్లి మాణిక్యారావు,గాదె వెంకటేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు అతిధులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈసమావేశంలొ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర,మహమ్మద్ ఖుద్దూస్,కావూరి చంద్రమోహన్,కరణం వెంకటేశ్వరరావు, జొన్నదుల మహేష్, రావి చిన్ని, కేసన కోటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావు, తడిబోయిన హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 కోట్లతో అరసవల్లి ఇంద్ర పుష్కరిని అభివృద్ధి

○ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఈవో ఆహ్వాన పత్రిక అందజేత

○ ఈ నెల 21 శంకుస్థాపన చేయనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంద్ర పుష్కరిని ఆధునీకరణ పనులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ పనులకు రూ. 4 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 21 ఇంద్ర పుష్కరిని ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఇంద్ర పుష్కరిని అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పినప్పటికీ సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. చుట్టూ ఉన్న మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంద్ర పుష్కరినికి నీరు అందించే ప్రధాన కాలువలు మూతపడ్డాయి. ఈ పనులన్నింటిని



చేపట్టకపోవడం వల్ల అంతర్భాగంలో మట్టి పూడిపోయింది. ఈ పనులన్నింటినీ ఇప్పుడు చేపట్టనున్నారు. ఇప్పటికే శంకుస్థాపనకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నిమ్మాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, సిబ్బంది మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## బాబు వచ్చారు.. జాబ్ వచ్చింది : ఎమ్మెల్యే నసీర్

○ మంత్రి నారా లోకేశ్ చెప్పింది చేశారు

○ యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

○ 10 వేలకుపైగా పోస్టులతో జాబ్ క్యాలెండర్ హర్షణీయం

○ ఉద్యోగులకు తీపి కబురు చెప్పినందుకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ కు ధన్యవాదాలు

○ కూటమి ప్రభుత్వంలోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):యువగళం పాదయాత్రలో యువనేత, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పిన హామీ మేరకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తూ మడమతిప్పని ప్రభుత్వమని నిరూపించుకున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎమ్మెల్యే నసీర్ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా నిరుద్యోగులకు తీపి కబురు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ ఏడాది యువత జీవితాలు కాంతిమయంగా కావాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదలైందని, ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టుల భర్తీకి మే 15న నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నారని తెలిపారు. 91 గ్రూపు-1పోస్టులకు, హోం శాఖలో 2,778 పోస్టులకు ఆగస్టు 15న, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టులు, 750 గ్రూపు-2 పోస్టులకు, 503 ఏఈఈ పోస్టులకు, ఇతరత్రా 506 పోస్టులకు సెప్టెంబరు 15న, పాఠశాల, ఇంటర్ విద్యకు చెందిన 3,004 పోస్టులకు అక్టోబరు 15న నోటిఫికేషన్ విడుదల చేయనుం డటం సంతోషకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ పేరిట నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకుపైగా టీచర్ పోస్టులు భర్తీ చేశామని వెల్లడించారు. దీంతోపాటు ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు, నిరుద్యోగుల యువతతకు అపారమైన అవకాశాలు సృష్టించేందుకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొస్తున్నారని వివరించారు. ఇటు ఉద్యోగావకాశాలు కల్పించడంతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. నిరుద్యోగులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కలలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు.

## నిరుద్యోగులకు నిజమైన ఉగాది కానుక : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):ఉగాది పండుగ సందర్భంగా నిరుద్యోగ యువతకు మంత్రి నారా లోకేష్ జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం హర్షణీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో, మంత్రి లోకేష్ చొరవతో ఒక వైపు రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకువస్తూ, మరో వైపు జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్‌లో ముఖ్యంగా విద్య, పోలీస్ శాఖలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ సంకల్పాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి జగన్‌రెడ్డి యువతను మోసం చేశారని, కమిషన్ల కోసం ఉన్న పరిశ్రమలను కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. దీంతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కట్టుబడి పనిచేస్తోందని, నిరుద్యోగులకు నారా లోకేష్ పెద్దన్నలా అండగా నిలుస్తున్నారని తెలిపారు. 2026 జాబ్ క్యాలెండర్ విడుదల ద్వారా యువత ఆశలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

రాష్ట్రంలో 10,060 ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల కావడం శుభ పరిణామమని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల్లో సుమారు 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. గత వైసీపీ హయాంలో జాబ్ క్యాలెండర్ హామీ అమలు కాకపోవడం వల్ల యువత నష్టపోయిందని విమర్శించారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నారా లోకేష్ అమలు చేస్తున్నారని, యువత తమకు లభిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ జాబ్ క్యాలెండర్ విడుదలతో నిరుద్యోగులకు నిజమైన ఉగాది పండుగ వచ్చినట్లేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## గుంటూరు బీజేపీ కార్యాలయంలో వైభవంగా ఉగాది ఉత్సవాలు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

మొదటగా తిరుపతిరావు దంపతులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం చేపట్టి, రాశుల ప్రభావం, ఫలితాలు, ఆదాయ–వ్యయాలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం రాజకీయంగా బీజేపీకి అనుకూలంగా ఉండనున్నదని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలు, సలహాలను ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని, ఆయన రాజకీయ అనుభవాన్ని ఇతర దేశాల నాయకులు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీ మరింత బలపడి, భవిష్యత్తులో అధికారం సాధించే దిశగా ప్రయత్నాలు ఫలిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్రంలో మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశ ప్రజల ఆదరణను మరింతగా పొందుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, ఆల్ ఇండియా స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కెవి సుబ్బారావు, పబ్లిసిటీ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్ గౌడ్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్య నారాయణ, శ్రావణకుమారి, ఉపాధ్యక్షులు విమలాదేవి, మేరీ సరోజిని, కార్యదర్శులు నారాయణరెడ్డి, సురేష్ జైన్, రాదామాధవి, దారా అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నారా లోకేష్ సహకారంతో రంజాన్ తోఫా పంపిణీ



○ 180 మంది ఇమామ్, మౌజన్, హాఫీస్ లకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన నేతలు

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలోని మసీదులలో ఉన్న 180 మంది ఇమామ్, మౌజన్, హాఫీస్ లకు రంజాన్ తోఫాను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంను పట్టణంలోని జామీయా మసీదు వద్ద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి ఇబ్రహీం మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ పర్వదినాలు ఎంతో ప్రాముఖ్యమైనవని, ఉపవాస దీక్ష అనేది కేవలం అల్లా అనుగ్రహం కోసమే కాదని, సమాజంలో సోదర భావం, ఐకమత్యం, దయాగుణం, ప్రేమ పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నియోజకవర్గంలోని అన్ని మసీదులలో ఉన్న ఇమామ్, మౌజన్, హాఫీస్ లకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుంచి మంత్రి నారా లోకేష్ సహకారంతో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా విస్మరించడంతో పాటు వారిని ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి పోతీనేని శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

## యువగళం హామీలు నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం : చీఫ్ విప్ జీవీ



వినుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ): యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రభుత్వం జీవి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడారు. ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వ జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా ఉన్నత విద్య విభాగంలో 1500 పోస్టులు, గ్రూప్–1, గ్రూప్–2, హోమ్ శాఖ, పాఠశాల మరియు ఇంటర్ విద్య శాఖల ద్వారా మొత్తం 10,060 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటోందని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు నారా లోకేష్ చెప్పిన విధంగా ఇప్పటికే 6,25,300 ఉద్యోగాలు కల్పించామని జీవీ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా మెగా డీఎస్సీ ద్వారా 16,500 పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు.రాష్ట్రానికి దావోస్‌లో జరిగిన పెట్టుబడుల సదస్సులో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సమిష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం రూ. 9.70 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, ఆ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌ను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం, రంజాన్ పండుగల శుభాకాంక్షలను ప్రజలకు తెలియజేసారు.కార్యక్రమం లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య , టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరావు, పీవీ సురేష్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపరాభవను సామూహిక హనుమాన్ చాలీసాతో స్వాగతించిన మహిళా భక్తులు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ పరాభవ ఉగాది వేడుకలను గురువారం సాయంత్రం, ఆర్తి మీర హనుమాన్ చాలీసా పారాయణతొ ఘనంగా నిర్వహించారు. సహస్ర గళ ములతొ హనుమాన్ చాలీసా పారాయణం ప్రాధాన్యతను సంతరించుకుంది. అనంతరం శ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. లోక కళ్యాణార్ధం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఉగాది వేడుకలను నిర్వహించడం గత రెండు సంవత్సరాలుగా, హనుమాన్ అనుగ్రం కోరుతూ నిర్వహిస్తున్నట్లు హనుమాన్ ఉపాసకులు ఉప్పల వరదరాజులు చెప్పారు.నూతన పరాభవ సంవత్సరంలో భగవంతుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# అయోధ్య రామ యంత్ర ప్రతిష్ఠలో పాల్గొన్న రాష్ట్రపతి



○ బాలరామునికి పూజలు

**అయోధ్య (జర్నలిస్ట్ ఫైల్) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయాన్ని గురువారం నాడు దర్శించారు. బాలరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంపుల్ కాంప్లెక్స్‌లో 'రామ యంత్ర' ప్రతిష్ఠలో పాల్గొన్నారు.

ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా రాష్ట్రపతి వెంట ఉన్నారు.

ఆలయ నిర్మాణంలో పనిచేసిన సుమారు ఆరువేల మంది కార్మికులను, అంగడి వ్యాపారులను, కళాకారులను ఈ కార్యక్రమానికి రామజన్మభూమి ఆలయ ట్రస్టు ఆహ్వానించింది.

శ్రీరామ యంత్రాన్ని రాష్ట్రపతి ప్రతిష్ఠించి, హారతి ఇచ్చారు. అనంతరం టెంపుల్ కాంప్లెక్స్‌లోని ఏడు ఆలయాలను ఆమె దర్శించారు. ఈరోజుతో రామ్‌లల్లా నిర్మాణం పూర్తి కావడం విశేషమని, యావద్దేశ ప్రజలే కాకుండా విదేశీయులు సైతం ఇక నుంచి పూర్తి ఆలయాన్ని దర్శించుకోవచ్చని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి మహరాజ్ తెలిపారు.

అయోధ్యలోని రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ 2023 జనవరి 22న జరిగింది. ఆ తర్వాతి సంవత్సరం 2024 మే 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా రామాలయాన్ని సందర్శించారు. మరోసారి ఉగాది పర్వదినం సందర్భంగా అయోధ్య రాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు రామ యంత్ర ప్రతిష్ఠాపనలో పాల్గొనడం విశేషం.

# కేరళంలో ఎల్‌డీఎఫ్ పాలనపై బీజేపీ నేత తాడువాయి రామకృష్ణ విమర్శలు




**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్):** కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై బీజేపీ నాయకుడు, తొడుపుజ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. తొడుపుజ జిల్లా అధ్యక్షురాలు శ్రీవిద్య రాజేష్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, సంక్షేమ పథకాల అమలులో లోపాలు ఉన్నాయని ఆరోపించారు.

ఉపాధి అవకాశాల లేమితో యువత రాష్ట్రాన్ని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎన్‌సి-లావలిన్ వ్యవహారం, గోల్డ్ స్మగ్లింగ్ కేసులు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీశాయని విమర్శించారు. తిరువనంతపురం పరిణామాలు రాష్ట్రంలో మార్పుకు సంకేతంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో బీజేపీ, ఎన్డీఏ కూటమి కేరళంలో గణనీయమైన పురోగతి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్ సర్కార్" ద్వారా కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధి వేగవంతమవుతుందని, "వికసిత్ కేరళం" లక్ష్యంగా రైల్వేలు, ఐటీ రంగం, ఉపాధి అవకాశాలు, టెక్నాలజీ హబ్‌లు, మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కార ప్రోత్సాహం సంస్కృతి భాగం

○ ఎమ్మెల్సీ ఆలపాటిరాజేంద్రప్రసాద్




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఉగాది ఉత్సవాల పేరిట విభిన్న రంగాలలో రాణిస్తున్న వారిని ప్రోత్సహించడం ముదావహమని, ఇది మన సంస్కృతిలో భాగమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వాహకులను అభినందించారు.

కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఉగాది వేడుకలు కొలహలంగా జరిగాయి. తొలుత చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీ ములుకుట్ల బ్రహ్మానంద శాస్త్రి ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు చందూ సుబ్బారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా విశిష్ట అతిథులుగా అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు, డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, తుమ్మల కిషోర్ బాబు, గాజుల విజయ సారథి ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెనాలి డిఎస్పి బి.జనార్ధనరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తోట రాఘవరావు, డబల్ హార్స్ గ్రూప్ డైరెక్టర్ పోతూరి లలిత కుమారి తరపున ఆసంస్థ చైర్మన్ మునగాల మోహన్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ కొమ్మినేని జగదీశ్వరి, యర్రు బాపారావు, చల్లగాలి శ్రీదేవి, అంబటి మురళీకృష్ణ, పాకనాటి రమాదేవి, జాస్తి వినోద లక్ష్మి, రంగిశెట్టి రమేష్, రంగం రాజేష్, యర్రు స్వాతి, బట్టు లక్ష్మీ జ్యోతి, గేరా జయ ప్రకాష్ లకు ఉగాది పురస్కారాలను అతిథులు చేతుల మీదుగా ప్రధానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉగాది వేడుకల ప్రాధాన్యతను వారిదైన శైలిలో వివరించారు. పరాభవం జీవితం లో ఓకోణమని దాన్ని ధైర్యంగా ఎదుర్కొవాల్సిన అవసరాన్ని వివరించారు. మన సంస్కృతిలో మన పెద్దలు పొందుపరచిన విషయాలన్ని, మనల్ని మనం ఉన్నతంగా మలుచుకునేందుకు దోహద పడే మార్గాలని, షడ్ రుచుల వేప పూత పచ్చడి, ఉగాది పండుగ వేళ తీసుకోవడంలో, ఆరోగ్యపరంగా, సంస్కృతి పరంగా, విలువైన సమాచారం ఉంటుందన్నారు. ఉగాది ఉత్సవాల నిర్వాహణ కొత్త దనం చాటుతుందని నిర్వాహకులను ప్రశంశించారు. కార్యక్రమాన్ని ఫౌండేషన్ అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ మాస్టారు, నిర్వహణ కమిటీ సభ్యుడు చింతల శ్రీనివాసరావు, మొవ్వా సత్యనారాయణ, వేజండ్ల సత్య, దీపాల తారక్ సాయినాథ్, చందు సూర్య, కనపర్తి బెనహర్, చెరుకూరి రమేష్ బాబు, బెల్లంకొండ వెంకట్, కొండముది రమేష్, తన్నీరు కళ్యాణ్ కుమార్ పర్యవేక్షించారు.

# రంజాన్ తోఫా పంపిణీ విధానం ముదావహం



○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పవిత్రమైన రంజాన్ పండుగను, సంఘీయ నిరుపేదలు జరుపుకోవాలని రంజాన్ తోఫా పంపిణీ చేపట్టడం ముదావహమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మారీస్ పేట 22 వార్డులో పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద వర్గాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగని ప్రతి ఒక్కరు జరుపుకోవాలని ఆకాంక్షతో ఆరు రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా పంపిణీ చేయటం సంతోషదాయకమని అన్నారు. నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అద్యక్షులు మొహమ్మద్ కుద్దూస్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు, పట్టణ పార్టీ ప్రధానకార్యదర్శి వసంతం అశోక్, సీనియర్ నాయకులురావి చిన్ని, పసుపులేటి త్రిమూర్తి, మహేష్,నియోజకవర్గ తెలుగుయువత అద్యక్షులు కోగంటి రోహిత్ ఫణిదపు దుర్గా,అత్తోట శరత్, 22 వార్డు అద్యక్షుడు హబీబ్, కోశాధికారిమహబూబ్ భాషా తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైభవంగా ఉగాది వేడుకలు







**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పరాభవనామ సంవత్సర ఉగాది సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ పట్టుపంచె, లాల్చీలు ధరించి అచ్చతెలుగు వేషధారణలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, కార్యాలయ ఇన్‌ఛార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాతూరి నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మొదట తులసి పూజ, గో పూజ, గ్రామ దేవత ఆరాధన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పండితుడు శివరామ యజ్ఞనారాయణ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించి రాశులు, ఫలితాలు, ఆదాయ-వ్యయాలపై వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి గొప్పదనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న జీవనశైలిలో స్వీయ సంస్కృతి, సంప్రదాయాలపై గౌరవం తగ్గిపోకుండా చూడాలని సూచించారు. పంచాంగం కాల గణనలో అత్యున్నతమైన వ్యవస్థగా పేర్కొంటూ, భారతీయ సంస్కృతి విశిష్టతను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతిని పునఃప్రతిష్ఠించే వేదికగా పనిచేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచానికి మార్గదర్శకంగా ఎదుగుతోందని, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ట పెరిగిందని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈ సందర్భంగా సన్మానాలు చేశారు. తెలుగు అధ్యాపకుడు సుబ్బారావు, జర్నలిస్టు ప్రసాద్, దళిత పురోహితుడు రామదాసు, నర్సు రాజేశ్వరి, సేంద్రీయ రైతు సంబిరెడ్డి, చేనేత కార్మికుడు కొలను కృష్ణ, మాజీ సైనికుడు మధుసూదన్ రావులను సత్కరించారు.

# ఏబీఎన్ రిపోర్టర్ పూర్ణచంద్రరావు మృతిపై పీవీఎన్ మాధవ్ సంతాపం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ ఏపీ బ్యూరో రిపోర్టర్ కేసంనేని పూర్ణచంద్రరావు ఆకస్మిక మృతిపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సంతాపం తెలిపారు. చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలతో పూర్ణచంద్రరావు మృతిచెందడం తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. వృత్తిపట్ల ఆయనకు ఉన్న అంకితభావం, సమాజం పట్ల బాధ్యత, సమస్యలపై లోతైన అధ్యయనం జర్నలిజంపై ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

చురుకైన రిపోర్టింగ్‌తో ప్రత్యేక గుర్తింపు పొందిన పూర్ణచంద్రరావు, పనిచేసిన ఛానల్ పేరునే తన గుర్తింపుగా మార్చుకున్నారని తెలిపారు. "ఏబీఎన్ పూర్ణ"గా రాష్ట్రవ్యాప్తంగా గౌరవం పొందిన ఆయన మృతి జర్నలిజం రంగానికి తీరని లోటుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. నిజాన్ని నిర్మొహమాటంగా వెలిబుచ్చే ధైర్యం ఉన్న మంచి జర్నలిస్టును కోల్పోవడం బాధాకరమని తెలిపారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు, జర్నలిస్టు మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వ సంకల్పం సిద్ధిస్తుంది

- ○ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాభివృద్ధి
- ○ శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి
- ○ తెలుగుజాతి నెంబర్-1 అవుతుంది
- ○ స్వార్థంతో తల్లికీ, చెల్లికి ఆస్తులివ్వని వ్యక్తులున్నారు
- ○ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఉగాది వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ○ టీటీడీ, వ్యవసాయ శాఖల పంచాంగాలను ఆవిష్కరించిన సీఎం
- ○ ఉగాది వేడుకల్లో పంచాంగ పఠనం చేసిన మాడుగుల నాగఫణిశర్మ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికలతో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథాన నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2047 నాటికి తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఉగాది పచ్చడి ప్రసాదాన్ని సేవించిన అనంతరం మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం చేశారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. ఉగాది పచ్చడి మన జీవితాలను ప్రతిబింబిస్తుందని.. షడ్రుచుల తరహాలోనే జీవితంలో కష్ట సుఖాలు ఉంటాయని ముఖ్యమంత్రి అన్నారు. పండుగలు ఆరోగ్య కరమైన జీవనశైలిని నేర్పుతాయన్నారు. పండుగలు, ఆచారాల్లోనే సైన్సు ఉందని...వాస్తు లాంటి శాస్త్రాలు, సూర్య నమస్కారం లాంటి ఆచారాలు ఇలాంటి వేనని సీఎం అన్నారు. యోగా, నేచురోపతి లాంటి వైద్యం కూడా ప్రకృతి నుంచి వచ్చిందేనని...ఆరోగ్యం, ఆనందం, సంపద వీటి వల్లే సాధ్యం అవుతుందన్నారు. నేలను, ప్రకృతిని, నీటిని ఆరాధిస్తామని.. దానిని అందిపుచ్చుకుని నీటిని పరిరక్షించేలా నీటి భద్రత విధానాన్ని తీసుకువచ్చామన్నారు. తాగునీటికి, సాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా నీటి యాజమాన్యం చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం వేసవి వచ్చినా రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 65 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. అందుకే మే 15 నాటికే నారుమళ్లు వేసుకోవాలని ముందుగానే ప్రకటించిన ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రిగా మూడో మారు గోదావరి పుష్కరాలను నిర్వహించే గౌరవం తనకు దక్కిందని.. ఆ తదుపరి కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఇప్పటి వరకూ రూ. 1943 కోట్ల రూపాయలు ఇచ్చామని.. గత పాలకులు పైసా కూడా వారికి ఇవ్వలేదన్నారు. అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కావాలంటే పోలవరం పూర్తి కావాలని.. గోదావరి పుష్కరాలకంటే ముందు ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కృష్ణా డెల్టాకు, విశాఖకు గ్రావిటీతో నీళ్లు వెళ్తే.. రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇంకా రూ. 5 వేల కోట్ల మేర నిధులు వ్యయం చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు అందిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

**విదేశాల్లో మన సంస్కృతికి తెలుగువారే బ్రాండ్ అంబాసిడర్లు:** సమీప భవిష్యత్తులో పూర్తిస్థాయి సాంకేతికతతో పాలన జరిగే అవకాశం ఉంటుందని, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇలా వేర్వేరు పరిస్థితులు అప్పటికప్పుడు అధ్యయనం చేసి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చేసిందన్నారు. 30 ఏళ్ల క్రితమే తాను ఐటీ విప్లవాన్ని ఊహించి టెక్నాలజీని ప్రోత్సహించానని తద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వచ్చిందని అన్నారు. నాడు తీసుకున్న నిర్ణయంతోనే హైదరాబాద్ ఇప్పుడు నాలెడ్జి ఎకానమీగా ఎదిగిందన్నారు. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సెంటర్ల గురించి చర్చిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు నేర్పే విలువలను గౌరవించాలని.. ఇక్కడ ఉండే మనకంటే విదేశాల్లోని ప్రవాస తెలుగు వారు వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టటమే తన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని ప్రాజెక్టు ద్వారా ముఖ్యమైన ముందడుగు వేశామన్నారు. 2024 కంటే ముందు ఎవరూ సంతోషంగా పండుగలు జరుపుకునే పరిస్థితి లేదని.. ఒక వ్యక్తి కారణంగా ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయని ఆక్షేపించారు. స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ 56 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దివ్యాంగశక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత ప్రయాణంతో ఆత్మగౌరవాన్ని కల్పించటంతో పాటు డబ్బులు ఆదా అయ్యేలా చేస్తున్నామని వివరించారు. అర్చకులకు రూ. 15 వేల వేతనం ఇవ్వటంతో పాటు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు.

**కంజ్యూమర్ జస్టిస్ లో అగ్రస్థానంలో ఏపీ :** సమాజంలో అట్టడుగున ఉండిపోయిన వారిని పేదరికం నుంచి బయటపడేసేలా జీరో పావర్టీ కార్యక్రమం పీ4 చేపట్టామని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా దీనిని అమలు చేస్తున్నట్టు వివరించారు. సమాజంలో సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 చేపట్టామని తెలిపారు. తాను పనిచేసేది 5 కోట్ల మంది రాష్ట్రప్రజల కోసమని.. అందరి జీవన ప్రమాణాలు మెరుగుపర్చటం కోసమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి కోసం విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ప్రాంతీయ ఎకనామిక్ కారిడార్లు తీసుకువచ్చామని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలైన్లు అనుసంధానం చేసి లాజిస్టిక్స్ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు వివరించారు. ప్రజా రాజధాని అమరావతి అద్భుతంగా అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు చేశామని ముఖ్యమంత్రి తెలియచేశారు. తాను అందరివాడిగా ఉండాలని కోరుకుంటున్నానని కొందరు దుష్టులు ఏమార్చే కుట్రలు చేస్తారని వారి నుంచి అప్రమత్తంగా ఉండాలని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు హామీ ఇచ్చినట్టుగానే 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సంకల్పం చేశామన్నారు. ఉగాదిని పురస్కరించుకుని 10,060 ఉద్యోగాలను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ జారీ చేశామని తెలిపారు. మే 15 నుంచి అక్టోబరు వరకూ వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. గత 21 నెలల్లో 15,940 మంది టీచర్లకు మెగాడీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించామని, 5757 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలు చేశామన్నారు. పరాభవ నామ సంవత్సరంలో తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిచెప్పేలా సంకల్పం చేద్దామని సీఎం పిలుపునిచ్చారు.

**రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి- ప్రజలకు సుఖ శాంతులు- మాడుగుల నాగఫణిశర్మ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజయం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సంకల్పించిన ప్రతీదీ ఫలిస్తుందని స్పష్టం చేశారు. తెలుగు వారు ఏ రంగంలో ఉన్నా అగ్రస్థానంలో ఉండాలన్న ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యంగా ప్రజాహితంతో ముందడుగులు వేస్తాయని వెల్లడించారు. లగ్నాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంటుందని.. అందుకే ఉగాదికి ముందుగానే కురిసిన వర్షం దీనికి సూచిక అని తెలిపారు. ప్రత్యేకంగా ఈ ఏడాది సాంస్కృతిక చైతన్యం కలుగుతుందని వివరించారు. పంచాంగ పఠనం చేసిన బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మను సీఎం నూతన వస్త్రాలతో సత్కరించారు. అనంతరం టీటీడీ పంచాంగం, వ్యవసాయ పంచాంగంతో పాటు సాంస్కృతిక శాఖ క్యాలండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో విశిష్ట కృషి చేసిన కళాకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది పురస్కారాలు అందించారు. సాహిత్యం, సంగీతం, కళలు, సామాజిక సేవ రంగాల్లో ఉగాది కళారత్న పురస్కారాలను సీఎం అందించారు. 38 మందికి కళారత్న, 122 మందికి ఉగాది పురస్కారాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. వివిధ దేవాలయాలకు చెందిన పురోహితులను ముఖ్యమంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467